సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 11 । అక్టోబర్ । 2025



విద్యుత్ ఉద్యోగుల సమ్మె బాట

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు కడప డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. -8లో



దొంగల ముఠా అరెస్టు

ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లే ఆరుగురు అంతర్ జిల్లాల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.6/23.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 23.4 - 32.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డీఎస్‌డీఓగా గౌస్ బాష



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వైఎస్సార్ కడప జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా గౌస్‌బాష నియమితులయ్యారు. ప్రస్తుతం అన్నమయ్య డీఎస్‌డీఓగా పని చేస్తున్న ఈయనను జిల్లా డీఎస్‌డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో కడప డీఎస్ఏ స్టేడియంలో, వైఎస్సార్ క్రీడా పాఠశాలలో వాలీబాల్ కోచ్‌గా పని చేశారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి జగన్నాథ్ రెడ్డిని రిలీవ్ చేయడంతో వైఎస్సార్ క్రీడా పాఠశాల ఎస్‌ఓగా కొనసాగనున్నారు.

ఏఎఫ్‌యూ అభివృద్ధికి కృషి



ఏఎఫ్‌యూ వీసీ జయరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: డా. వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని వైస్ చాన్సలర్‌గా బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ బొమ్మిరెడ్డి జయరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బొమ్మిరెడ్డి జయరామిరెడ్డి ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మకత, వినూత్న, విద్యా ప్రామాణికతలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మౌలిక సదుపాయాలు, విద్యా నాణ్యత పెంపునకు కృషి చేస్తానని అన్నారు.

ముగిసిన నూతన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ-25కు సంబంధించి నూతన ఉపాధ్యాయుల పోస్టుల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా వారికి స్థానాల కోసం గురు, శుక్రవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన స్కూల్ అసిస్టెంట్లకు మదనపల్లిలో, ఎస్జీటీలకు కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా 390 మంది స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా, 290 మంది ఎస్జీటీలకు మ్యానువల్ విధానంలో డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. వీరంతా 13వ తేదీ వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ: న్యూఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి మొదటి పారా యోగాసనా స్పోర్ట్స్' ఛాంపియన్‌షిప్-2025లో స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థిని జి.మధులత అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచింది.ద్వితీయ స్థానం దక్కించుకుని సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. యోగాసన భారత్ పోటీలు మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా ప్రాంగణంలో నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి దివ్యాంగులు పాల్గొన్నారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగురాలైన మధులత యోగా మాస్టర్ అనిత వద్ద శిక్షణ తీసుకున్నట్లు పట్టుదలతో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

పేదలకు ఆరోగ్య భరోసా కల్పించే 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు (ఆరోగ్య శ్రీ) శుక్రవారం నుంచి పూర్తిగా నిలిచి పోయాయి. ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బిల్లులను మంజూరు చేయలేదు. దీంతో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉచిత వైద్య సేవలను నిలుపుదల చేశారు. దీంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో పూర్తిగా నిలిచిన వైద్య సేవలు
- అత్యవసర, సాధారణ కేసులు ప్రభుత్వ ఆసుపత్రులకు పంపాలని సూచనలు
- వైద్యం కోసం పేదల అవస్థలు
- 'ఎన్టీఆర్ వైద్య సేవ'లపై 'పచ్చ' నీడలు



ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్ కోసం వేచి చూస్తున్న రోగులు



ఉచిత వైద్యం కోసం ఆరోగ్యమిత్రతో చర్చిస్తున్న రోగులు

జిల్లాలో 'ఎన్టీఆర్ వైద్య సేవ' వివరాలు	ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు	
నెట్ వర్క్ ఆసుపత్రుల సంఖ్య మొత్తం: 119	ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రులు: 42	ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం బకాయిలు : రూ 150 కోట్లు
అందులో ప్రభుత్వ ఆసుపత్రులు: 77	ఒక ఆసుపత్రికి ఒక నెలకు ఖర్చు: రూ 30 లక్షల నుంచి రూ 60 లక్షలకు పైగా	వర్తించే వ్యాధులు: 3,255
		ఒక రోజుకు వచ్చే రోగులు: 2 వేలకు పైగా

కడప రూరల్: 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం అస్తవ్యస్తంగా మారింది. ఈ పథకంలో భాగంగా కార్పొరేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రధాన ఉద్దేశ్యం. అయితే ప్రభుత్వం ఈ నెట్ వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పెండింగ్ బిల్లులు రూ. కోట్లల్లో పేరుకు పోయాయి. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలు 'బకాయిలు చెల్లిస్తే గాని తాము కోలుకోలేము..పేదలకు ఉచిత వైద్యంను అందించలేము' అని చెప్పాయి.

వైద్య సేవల నిలుపుదల ఎన్నాళ్లో..?

ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో సెప్టెంబర్ నెలలో ఉచిత ఓపీ సేవలను నిలుపుదల చేసి తమ నిరసనను తెలిపారు. తాజాగా శుక్రవారం నుంచి పూర్తిగా అన్ని వైద్య సేవలను నిలుపుదల చేశారు. ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు గత్యంతరం లేక సంపూర్ణంగా వైద్య సేవలను బంద్ చేశారు. గుండె, న్యూరో తదితర పెద్ద జబ్బులకు ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు లభిస్తాయి. ఇప్పుడు పూర్తిగా వైద్య సేవలను నిలుపుదల చేయడంతో పేదల బాధలు వర్ణనాతీతంగా మారాయి. వైద్య సేవల నిలుపుదల ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సలహాలు...

సూచనలు, సలహాలు ఇవ్వడానికి నెట్ వర్క్ ఆసుపత్రుల్లో వైద్య మిత్రల డెస్క్ ఉంటుంది. ఇక్కడికి యథాలాపంగా వచ్చే రోగులకు వైద్య మిత్రులు 'బంద్ జరుగుతోంది. వైద్య సేవలు అందుబాటులో లేవు. మీరంతా కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లేదా ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లండని' సలహా ఇస్తున్నారు. దీంతో పెద్ద జబ్బు అయితే కడప రిమ్స్, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రితో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు వెళుతున్నారు. చిన్న సమస్య అయితే ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతున్నారు. ఇక్కడ డాక్టర్ ఫీజు రూ 300కు పైగా చెల్లిస్తున్నారు. వైద్య పరీక్షలకు ఎంత లేదన్నా రూ 300 నుంచి రూ 2 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అదే స్కానింగ్‌కు అయితే రూ 7 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా జిల్లాలో ఎవరికైనా పెద్ద సమస్య వచ్చిందంటే కడప నగరానికి రావాల్సిందే. ఇక్కడ ఆ వ్యాధికి చికిత్స లభించకపోతే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివుంటుంది. పైగా ఇది సీజనల్ వ్యాధుల కాలం. డెంగ్యూ, టైఫాయిడ్ తదితర జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో వైద్య సేవలు బంద్ కావడంతో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.



'ఆరోగ్య శ్రీ'పై కూటమికి అక్కసు

2007-2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యంను అందించాలనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ పథకంను ప్రవేశపెట్టారు. తద్వారా లక్షలాది మంది పేదలు ఉచిత వైద్యం ద్వారా పునర్జన్మను పొందారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకంను మరింత బలోపేతం చేసింది . కాగా టీడీపీ ప్రభుత్వం ఎప్పుడొచ్చినా 'ఆరోగ్య శ్రీ' పథకం ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. దీంతో 'ఆరోగ్యశ్రీ' అంటే టీడీపీకి అక్కసు అనే అభిప్రాయం నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలల కాలంలోనే 4వ సారి ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్య సేవలను నిలుపుదల చేశారు. దీంతో 'ఎన్టీఆర్ వైద్య సేవ' వెంటిలేటర్‌పైకి చేరిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైద్య సేవలు బంద్ తగదు



ఉచిత వైద్య సేవల ద్వారా పేదలు ఎంతోమంది లబ్ధిపొందుతున్నారు. అలాంటిది ఇక్కడికి వచ్చాక బంద్ అని చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. నాతోపాటు వైద్యం కోసం వచ్చిన వారంతా ఇతర ఆస్పత్రులకు వెళ్లారు. వైద్య సేవలు బంద్ కావడం మంచిది కాదు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
-జగన్‌మోహన్‌రెడ్డి, తొండూరు

మాలాంటి పేదల గురించి ఆలోచించాలి



పేదలకు అందించే వైద్య సేవలను నిలుపుదల చేయడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. మా బంధువుకు ఒకరిని ఇక్కడికి తీసుకు వస్తే వైద్యసేవలు నిలిపి వేసినట్లు చెప్పారు. పెద్దాస్పత్రికి పొమ్మన్నారు. మనిషికి బాగా లేనపుడు ఎక్కడికని పోవాలి.
- గంగమ్మ, ఆదోని

వేరే ఆస్పత్రికి పొమ్మన్నారు



భుజం నొప్పి కారణంగా ఉచిత వైద్య సేవ కింద డాక్టర్‌కు చూపించుకునేందుకు కడపకు వచ్చాను. ఇక్కడికి వచ్చాక వైద్య సేవలను బంద్ చేసినట్లుగా చెప్పారు. వేరే ఆస్పత్రికి పొమ్మన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ సేవలు ఎప్పుడూ బంద్ కాలేదు. ఇప్పుడెందుకు బంద్ అవుతున్నాయో అర్థం కావడం లేదు.
- ఖైరూన్, వేంపల్లె

కంటి ఆపరేషన్ కోసం వచ్చాను



కంటి ఆపరేషన్ కోసం కడపకు వచ్చాను. తీరా ఇక్కడికి వచ్చాక వైద్య సేవలు నిలుపుదల చేసినట్లుగా తెలిపారు. ఇది విని నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మాలాంటి పేదలు బయట డబ్బులు పెట్టి వైద్యం చేయించుకోలేరు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.
- ఖాసిం, వేంపల్లె

వైద్య సేవలు నిలుపుదల చేశాం



నెట్ వర్క్ ఆసుపత్రుల వారికి కోట్లల్లో బిల్లులు అందాలి. ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి వైద్య సేవలను నిలుపుదల చేశాం.
- డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు, ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్

నిత్యపూజ స్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లి గ్రామం సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయం నూతన ధర్మకర్తల మండలిని కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ వారు నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈమేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ చైర్మన్‌గా జంగిటి రాజేంద్రప్రసాద్‌యాదవ్, సభ్యులుగా పి.మల్లీశ్వరి, పి.వసంత, బి.వెంకటసుబ్బయ్య, వి.కృష్ణయ్య, ఆర్.పార్వతమ్మ, సి.వెంకటసుబ్బయ్య, కె.రాజేశ్వరి, జె.శివారెడ్డి, కె.రూప నియమితులైనట్లు ఆయన తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా వర్షం



కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తన కారణంగా శుక్రవారం తెల్లవారుజామున జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ఇందులో భాగంగా పులివెందుల్లో అత్యధికంగా 69 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే కమలాపురంలో 39.2 , అట్లూరులో 38, జమ్మలమడుగులో 32 , పోరుమామిళ్లలో 31.2, ఎర్రగుంట్లలో 29.4, కాశినాయనలో 29.6 , లింగాల, ముద్దనూరులలో 25.2, దువ్వూరులో 24.2, పెండ్లిమర్రిలో 23.4 , పొద్దుటూరులో 22.4, ఖాజీపేటలో 22 , సికెదిన్నెలో 20.8 , సింహాద్రిపురంలో 18.6, మైదుకూరులో 15.2, పెద్దముడియంలో 13.8 , కలసపాడులో 12.4, వల్లూరులో 11.8 , బిమఠంలో 10.2, వేములలో 10 , రాజుపాలెంలో 7.8, తొండూరులో 6.8 , చక్రాయపేటలో 6.2, కడపలో 5.8, వీఎన్‌పల్లిలో 5.6, చాపాడులో 4.2, గోపవరంలో 4 , బద్వేల్‌లో 3.8, వేంపల్లిలో 2.8, బికోడూరు, చెన్నూరులలో 2.6, ఒంటిమిట్టలో 1.2, సిద్దవటంలో 1 మిల్లీ మీటర్ వర్షపాతం నమోదైంది.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

- ప్రజా ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ శ్రీకారం
- పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ మరో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలతో కలిసి కోటి సంతకాల సేకరణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి నవంబర్ 22వ తేదీ వరకూ రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణ చేయనున్నామన్నారు. అక్టోబర్ 23న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి, నవంబర్ 12న జిల్లా కేంద్రాలలో ర్యాలీలు, నవంబర్ 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు తరలింపు చేసి, నవంబర్ 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిస్తారన్నారు. ఆ తర్వాత గవర్నర్‌కు కోటి సంతకాల సేకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, పి. ప్రసాద్‌రెడ్డి, నిత్యానందరెడ్డి, రఘునాథరెడ్డి, షఫీవుల్లా, సీహెచ్ వినోద్, చీర్ల సురేష్ యాదవ్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉల్లిని ప్రభుత్వం తక్షణం కొనుగోలు చేయాలి

- హెక్టారుకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలి
- ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం సరఫరా
- ఆరునెలల క్రితమే చెప్పినట్లు టీడీపీ కార్యకర్తే ఫేస్‌బుక్‌లో పెట్టారు
- ఝార్ఖండ్ తరహాలో కల్తీ మద్యంపై సీబీఐ, ఈడీ జోక్యం చేసుకోవాలి
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్



ఉల్లి రైతులను ఆదుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, అంజద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్: ఉల్లి పంటను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజదబాషా, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలతో కలిసి ఆయన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉల్లి రైతులు అత్యంత దీన పరిస్థితిలో ఉన్నారన్నారు. మూడు రోజులుగా మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డిలు ఉల్లి పంటలను పరిశీలించి వారి సమస్యలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తెస్తున్నామన్నారు. క్వింటా ఉల్లిని రూ.1200తో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కమలాపురం, మైదుకూరులో కొనుగోలు కేంద్రాల ఫోన్ నంబర్లు కూడా ఇచ్చారన్నారు. ఆ ఫోన్లకు కాల్ చేస్తే ఏ ఒక్కరూ ఫోన్ తీయడం లేదన్నారు. మిట్టమానుపల్లెకు చెందిన ఓబన్న కుమారుడు ఓబులేసు అనే రైతు కూలీ ఖర్చులు కూడా రావనే బాధతో ఉల్లి పంటను వంకలో వేసి నీటి పాలు చేస్తున్న దృశ్యాలను మీడియాకు చూపారు. ఉల్లిని క్వింటా రూ.300లకు కూడా కొనుగోలు చేయని పరిస్థితి ఉందన్నారు. కర్నూలులో హెక్టారుకు రూ.50వేల పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇంతవరకూ జీవో ఇవ్వలేదన్నారు. దాన్ని వైఎస్సార్ కడప జిల్లాకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉల్లి సాగుకు ఎకరాకు రూ.1.20లక్షలు సాగు ఖర్చు అయ్యిందని, ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పంటను కొనుగోలు చేసి, హెక్టారుకు రూ.50వేల పరిహారం ఇస్తే కనీసం 60 శాతం రికవరీ అవుతుందన్నారు. లేనిపక్షంలో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రాష్ట్రంలో ఇన్ని తీవ్రమైన సమస్యలుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఎంపీ అన్నారు. అధికారయంత్రాంగం, పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడంపైనే వారి సమయాన్నంతా వెచ్చిస్తున్నారన్నారు. పులివెందులలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో పరామర్శకు వెళ్లిన వారిపై కూడా 307 సెక్షన్ల కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారని ఉదహరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. ఏపీలో రోడ్ల పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో విమానాల్లో చక్కర్లు కొట్టే పవన్ కళ్యాణ్‌కు ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం సరఫరా అవుతోందని ఆరునెలల క్రితమే చెప్పానని టీడీపీ కార్యకర్త ఒకరు ఫేస్‌బుక్‌లో పెట్టారన్నారు. 111కోట్ల క్వార్టర్ బాటిళ్లు తయారు చేసి, అందులో రూ.48కోట్ల క్వార్టర్ బాటిళ్లు అమ్మారన్నారు. ఝార్ఖండ్‌లో జరిగిన కల్తీ మద్యం కేసులో ఈడీ ఎంటరై సత్వర చర్యలు చేపట్టిందని, ఏపీలో ఇంత జరుగుతున్నా సీబీఐ, ఈడీ నిద్రపోతున్నాయని విమర్శించారు. నకిలీ మద్యం స్కాంను వెలికి తీసిన ఎక్సైజ్ సీఐ హిమబిందుకు సస్పెన్షన్‌ను బహుమతిగా ఇవ్వడం దారుణమన్నారు.

వైద్య సేవలు బంద్..

ప్రభుత్వం నెట్‌వర్క్ హాస్పిటళ్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేశారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా లేదా అనే అనుమానం కలుగుతోందని తెలిపారు.

- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పి. ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం

ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకు రూ.173 కోట్లు ఇన్సూరెన్స్ వచ్చిందని ప్రకటనలు ఇస్తున్నారని, ఏ ఊర్లో, ఏ పంటకు ఎంత బీమా వచ్చిందనే వివరాలు తెలపడం లేదన్నారు. క్వింటా రూ.2500లకు కొనాల్సిన ఉల్లిని ప్రభుత్వం రూ.1200లకు కొంటామని చెప్పి ఇప్పటికీ ఒక కేజీ కూడా కొనలేదన్నారు. జిల్లాలో ఉల్లి రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. నిన్న కొమ్మద్దిలో 16 ఎకరాల్లో ఉల్లి పంట వేసి నష్టపోయి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. గత ప్రభుత్వంలో 21 రోజుల్లో పంట నష్టం ఇచ్చేవారని గుర్తు చేశారు. ఈనెల 15వ తేదీ లోపు కూటమి ప్రభుత్వం స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

పెద్దదర్గా ఉరుసు విజయవంతం చేయాలి



ఉరుసు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పీఠాధిపతి తదితరులు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- పీఠాధిపతితో కలిసి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ
- నవంబర్ 4 నుంచి ఉరుసు ఉత్సవాల నిర్వహణ

కడప సెవెన్‌రోడ్స్: మత సామరస్యానికి ప్రతీక అయిన కడప పెద్దదర్గా ఉరుసు మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషిచేసేందుకు ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం దర్గా ముషాయిరా హాలులో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మత సామరస్యానికి ప్రత్యేక కూడలిగా ఉన్న దర్గా ఉరుసు కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇందులో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్వహించాల్సిన పనులు ఎక్కువగా ఉంటాయన్నారు. ఉరుసు జరిగే అన్ని రోజుల్లో పరిసరాలు శుభ్రంగా ఉండేందుకు నిరంతర పారిశుధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. పోలీసులు విధులు పక్కాగా ప్రణాళికయుతంగా నిర్వర్తించాలన్నారు. నవంబరు 5, 6, 9 తేదీల్లో ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తారు గనుక ఆరోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెవెన్యూ, పోలీసు, ఉరుసు ఉత్సవ కమిటీ సమన్వయంతో క్రౌడ్ మేనేజ్‌మెంట్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. భక్తుల రాక అధిక సంఖ్యలో ఉంటుంది గనుక ప్రజా రవాణా సర్వీసులసంఖ్య పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎయిర్‌పోర్టులలో సమాచార సలహా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వీటిలో దర్గా ఉత్సవ కమిటీకి సంబంధించిన వలంటీర్లు ఉంటూ ఉరుసుకు వచ్చే భక్తులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. పురుషులు, మహిళలకు మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సురక్షితమైన తాగునీరు, హైమాస్ లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 108 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ఎమ్మెల్యే మాధవీరెడ్డి, నగర మేయర్ ముంతాజ్‌బేగం, ఇతర అధికారులు, వివిధ వర్గాల ప్రతినిధులు, దర్గా భక్తులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

- ఆరుగురు అరెస్టు
- రూ.2లక్షలు విలువైన రాగి, 4 వాహనాలు స్వాధీనం
- డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్



పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రాగి ముద్దలు, వైర్, వాహనాలు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

మైదుకూరు : ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే రైతులకు తీవ్రనష్టం కలిగేలా పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లే ఆరుగురు అంతర్ జిల్లాల దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2లక్షలు విలువ చేసే రాగి, నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మైదుకూరు పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. ఆ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా అక్కమాంబాపురం గ్రామానికి చెందిన అయితా వెంకటేశ్వర్లు, పొదలకూరు గ్రామానికి చెందిన కుడుముల రాజేష్, పులగల చిన్న మస్తానయ్య, ఉయ్యాల పోతురాజు, కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన పంది శ్రీనివాసులు, చెర్లోపల్లె గ్రామానికి చెందిన గంగోడి దేవకుమార్ అనే వారు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లి విక్రయించుకునేవారు. వీరిపైన నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, సోమశిల, మర్రిపాడు పోలీస్‌స్టేషన్లలో 8 కేసులు, వైఎస్సార్ కడప జిల్లాలోని ఖాజీపేట, మైదుకూరు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం, బద్వేలు, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు పోలీస్‌స్టేషన్లలో 11 కేసులు నమోదయ్యాయి. ఈ రెండు జిల్లాల్లో ఇప్పటికే వీరు 40 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైర్‌ను దొంగలించారు. రాగి వైర్ చోరీపై నమోదైన కేసుల మేరకు మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, బ్రహ్మంగారిమఠం ఎస్ఐ బి.శివప్రసాద్ నిందితులను బ్రహ్మంగారిమఠం – మిట్టమానుపల్లె రహదారిలోని ఈశ్వరదేవీ గుహ సమీపంలో పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2లక్షలు విలువ చేసే 150 కిలోల రాగి ముద్దలు, 150 కిలోల రాగి వైర్ తోపాటు దొంగతనాలు చేసేందుకు ఉపయోగించే మూడు మోటార్ బైక్‌లను, ఒక గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, సిబ్బంది పి.వెంకటన్న, కేవీ రమణ, బీవీ రమణారెడ్డి, ఓబులయ్య, దాదావలి, రాజేష్, తిరుమలయ్య, గణేష్, నవీన్ కృషి చేశారని ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వారిని అభినందించారు. సమావేశంలో సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, ఎస్.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లు విక్రయం నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం వైపుగా..

ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లే అంతర్ జిల్లాల ముఠా సభ్యులు దొంగతనాలపై ఎలా ఆకర్షితులయ్యారే విషయాన్ని పోలీసులు తెలిపిన వివరాల మేరకు పరిశీలిస్తే ఎంతో ఆసక్తికరంగా అనిపిస్తుంది. నిందితుల్లో ఏ1గా ఉన్న అయితా వెంకటేశ్వర్లు, ఏ2గా ఉన్న కుడుముల రాజేష్‌లు రాజంపేట మండలంలోని మందపల్లె గ్రామం వద్ద కల్లు గీసి అమ్ముకొని బతుకుతుండేవారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన సమయంలో నీటి ప్రవాహానికి పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. వెంకటేశ్వర్లు, రాజేష్ ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లి అమ్ముకోవడం ప్రారంభించారు. పగటిపూట గూడ్స్ వాహనంలో పొలాల వెంట తిరిగి రెక్కీ నిర్వహించేవారు. రాత్రి సమయంలో దొంగతనాలు చేసేవారు. దొంగలించిన రాగి వైర్‌ను కొంత కరిగించి ముద్దలుగా, మరికొంత వైర్ రూపంలోనే నిందితుల్లో ఒకరైన గంగోడి దేవకుమార్‌కు చెందిన గూడ్స్ వాహనంలో తీసుకెళ్లి విక్రయించేవారు. రెండు జిల్లాల్లో ఎంతో మంది రైతులకు తీవ్ర నష్టం కలిగించిన వీరు ఆ క్రమంలోనే మైదుకూరు పోలీసులకు దొరికిపోయారు.

క్లుప్తంగా

విషద్రావణం తాగిన వ్యక్తి మృతి

– వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

పులివెందుల రూరల్ : కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం బయనపల్లె గ్రామానికి చెందిన వినయ్ కుమార్ పులివెందులలో నివాసం ఉంటున్నాడు. హార్మోనియం, కీబోర్డులు ప్లేయర్‌గా ఉంటూ అలాగే ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8వ తేదీన వినయ్ కుమార్ విషద్రావణం సేవించడంతో ఆయనను స్థానికులు పార్నపల్లె రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం వరకు అక్కడ వైద్యులు వినయ్‌కుమార్‌కు వైద్య పరీక్షలు అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని కడప రిమ్స్‌కు శుక్రవారం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రైవేట్ ఆసుపత్రి వద్ద వైద్యులు నిర్లక్ష్యం వల్లే వినయ్ కుమార్ చనిపోయాడని బంధువులు ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు చనిపోయారని మృతుడి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తూ బోరున విలపించారు. ఈ విషయంపై అర్బన్ సీఐ సీతారామిరెడ్డిని వివరణ కోరగా.. విష ద్రావణం తాగడంతోనే వినయ్ కుమార్ మృతి చెందాడన్నారు.

కూలిన మట్టి మిద్దె



ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో వర్షానికి పోలూరు వెంకటలక్ష్మికి చెందిన మట్టి మిద్దె గురువారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. సమయానికి ఇంటిలో ఎవరు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి దృష్టికి తీసుకెళ్లగా ఆమె పరిశీలించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కదిరి మహిళ..మదనపల్లెలో అదృశ్యం

మదనపల్లె రూరల్ : సత్యసాయి జిల్లా కదిరికి చెందిన మహిళ మదనపల్లెలోని బంధువు ఇంటికి వచ్చి అదృశ్యం కావడంపై ఆమె సోదరుడు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కదిరి మండలం సున్నపుగుట్ట తండాకు చెందిన బాలాజీనాయక్ భార్య వి.భాగ్యమ్మ (35) తిరుపతిలో ఉన్న తమ్ముడు భాస్కర్ నాయక్ వద్దకు వెళ్లి అక్కడ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. సెప్టెంబర్ 24న మదనపల్లె పట్టణం బుగ్గకాలువలో నివాసం ఉంటున్న దూరపు బంధువు పూర్ణ ఇంటికి వచ్చింది. కొద్దిరోజులుగా అక్కడే వారితో పాటు ఉంటోంది. అయితే ఈనెల ఏడోతేదీ సాయంత్రం 5 గంటల సమయంలో భాగ్యమ్మ తమ్ముడు భాస్కర్‌నాయక్‌కు ఫోన్‌చేసి తనను మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద పూర్ణ, ఆటోడ్రైవర్ రెడ్డి కొడుతున్నారని చెప్పింది. అనంతరం మరోసారి రాత్రి 10గంటల సమయంలో ఫోన్ చేసి వారి ఇంటికి వచ్చి మరోసారి తనను కొట్టారని చెప్పింది. అనంతరం ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. దీంతో భాస్కర్‌నాయక్, బంధువైన పూర్ణకు 8వతేదీ ఫోన్‌చేయగా భాగ్యమ్మ అప్పుడే వెళ్లిపోయిందని సమాధానం ఇచ్చింది. భాగ్యమ్మ ఆచూకీ కోసం వెతికిన సోదరుడు భాస్కర్‌నాయక్ శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అక్క అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు తప్పిన పెనూ ప్రమాదం



చిలంకూరు వద్ద రోడ్డుకు అడ్డంగా ఆగిన బస్సు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామం ముద్దనూరు రోడ్డు ఐసీఎల్ వద్ద ఉన్న వంతెన వద్ద ఏఆర్ ట్రావెల్ ప్రైవేటు బస్సుకు పెద్ద పెనుప్రమాదం తప్పింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలబడింది. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులెవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలాన్ని సీఐ విశ్వనాథ్‌రెడ్డి పరిశీలించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి నంద్యాలకు ఏఆర్ ట్రావెల్ బస్సు బయలు దేరింది. ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిలంకూరు గ్రామం ఐసీఎల్ వద్దకు రాగనే ఎదురుగా చెన్నై నుంచి తాడిపత్రికి బొగ్గును తీసుకెళ్లే లార్రీ వచ్చింది. డ్రైవర్ బ్రేక్ వేయాలని ప్రయత్నించాడు. బ్రేక్ ఫైయిలూర్ కావడంతో హ్యాండ్ బ్రేక్ వేశారు. దీంతో లారీని ఢీకొని రోడ్డుకు అడ్డంగా బస్సు ఆగిపోయింది. బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ సంఘటన తెల్లవారిజామున 5 గంటల ప్రాంతంలో జరిగింది పోలీసులు సంఘటన స్థలానికి చెరుకుని ట్రాఫిక్ అంతరాయం కాకుండా చూశారు.

జగదీష్ న్యూరో కేర్‌లో ఓపీ ఉచిత వైద్య సేవలు

కడప రూరల్ : స్థానిక జగదీష్ న్యూరో కేర్ జనరల్ మెడిసిన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో పేద ప్రజల సౌకర్యార్థం ఉచిత ఓపీ వైద్య సేవలను అందిస్తున్నట్లు జనరల్ ఫీజిషియన్ డాక్టర్ క్రాంతి రెడ్డి తెలిపారు. అలాగే ఉచిత ఓపీ సేవలతోపాటు షుగర్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి డాక్టర్ సూచించిన అన్ని రక్త పరీక్షలపై 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. దాదాపు రూ. 5000 విలువగల సిటీ స్కాన్ రూ. 2500లకే నిర్వహిస్తారని తెలిపారు. బీపీ, షుగర్, థైరాయిడ్, అన్ని రకాల విష జ్వరాలు, టీబీ, ఉబ్బసం, కిడ్నీ, లివర్, అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు.

హత్యకేసు అనుమానితులపై పాలిగ్రాఫ్ టెస్టుపూర్తి

జమ్మలమడుగు : గండికోటలో హత్యకు గురైన మైనర్‌బాలిక కేసు అనుమానితులపై పాలిగ్రాఫ్ టెస్టు పూర్తి చేసినట్లు సమాచారం. ఇటీవల గండికోటలో జరిగిన వైష్ణవి హత్య కేసు ఒక కొలిక్కి రాకపోవడంతో పోలీసులు కోర్టును ఆశ్రయించి అనుమానితులకు పాలిగ్రాఫ్ టెస్టు చేయించాలని కోరారు. దీంతో కోర్టు అనుమానితులకు టెస్టులు చేస్తామని వైష్ణవి బాయ్ ఫ్రెండ్ లోకేష్ తోపాటు సోదరులు కొండయ్య, సురేంద్రాలకు కోర్టు ద్వారా నోటీసులు ఇచ్చారు. దీంతో వారు కూడా తాము పాలిగ్రాఫ్ టెస్టుకు సిద్ధం అనడంతో కోర్టు ఈనెల 8వతేదీ నుంచి పాలిగ్రాఫ్ టెస్టుకు అనుమతినిచ్చింది. అనుమానితులైన లోకేష్, సురేంద్రా, కొండయ్యలకు హైదరాబాద్‌లో పాలిగ్రాఫ్ టెస్టు చేశారు. నివేదికను షీల్డ్ కవర్‌లో కోర్టుకు, పోలీసులకు వచ్చినట్లు సమాచారం. ఈ పాలిగ్రాఫ్ టెస్టు ద్వారా కేసు ఒక కొలిక్కి వస్తుందో లేదో చూడాలి.

వేడినీళ్లు మీద పడి బాలుడికి తీవ్రగాయాలు

మదనపల్లె రూరల్ : వేడినీళ్లు మీద పడి బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. వేపూరికోటకు చెందిన నాగరాజ, సుహాసిని దంపతుల కుమారుడు పృథ్వీ(5) ఇంట్లో ఆడుకుంటుండగా, స్టవ్‌పై అన్నం వండేందుకు ఉంచిన వేడినీళ్లు ప్రమాదవశాత్తు శరీరం మీద పడ్డాయి. దీంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్సలు చేయించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నిమ్మనపల్లె : ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలిక(17) మదనపల్లెలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ డిగ్రీ చదువుతోంది. ఈనెల 3న బాలికను కాలేజీ వద్ద నుంచి నిమ్మనపల్లె మండలం తవళానికి చెందిన కల్యాణ్ (20) అనే యువకుడు ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వస్తుండగా బాలిక కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ విషయమై బాలికను నిలదీయడంతో కల్యాణ్ తనను ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేసినట్లు చెప్పింది. తనను ద్విచక్రవాహనంలో బోయకొండ అటవీప్రాంతానికి తీసుకెళ్లి బలవంతం చేశాడని తెలిపింది. దీంతో యువకుడిపై బాలిక కుటుంబ సభ్యులు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ ఆరోపణలపై యువకుడు తాను బాలికను మోసగించలేదంటూ పోలీస్‌స్టేషన్‌లో తన వాదన వినిపించాడు. అయినా బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో – కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

చాపాడు : మండలంలోని ద్వారకానగరం సమీపంలోని పాల కేంద్రం వద్ద శుక్రవారం కారు – ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోలో దువ్వూరుకు వెళ్తున్న మురళి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బద్వేలుకు చెందిన లాయర్ బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కారులో కర్నూలుకు వెళుతున్నారు. ఇదే క్రమంలో మైదుకూరు నుంచి దువ్వూరుకు ఆటో వెళుతుండగా ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోలో వెళుతున్న మురళికి కాలు విరిగింది. కారు, ఆటో దెబ్బతిన్నాయి. గాయపడిన వ్యక్తిని స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఆటో, కారుకు సంబంధించిన వారు పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

బీసీ రిజర్వేషన్లపై నిగ్గుతేల్చాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో నిగ్గుతేల్చాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేశారని, ఆంధ్రప్రదేశ్లో కూడ రిజర్వేషన్ల బీసీలకు రాజకీయా, ఆర్థిక సామాజిక రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావడంలేదన్నారు. నామ మాత్రపు రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీలను రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల వాటాను తేల్చాలన్నారు. జనాభా దామాశా ప్రకారం బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాని విమర్శించారు. కార్యక్రమంలో పొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షులు పోసా ఆదినారాయణ, నాయకులు జగన్ నాయక్, శివ, ప్రసన్న కుమార్, కైపు రామాంజనేయులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

మైదుకూరు : పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగినట్లుగా భావిస్తున్న ఈ సంఘటనలో స్థానిక బద్వేలు రోడ్డులో ఉన్న మద్యం దుకాణం తాళాలు పగులగొట్టిన దుండగులు క్యాష్ పెట్టెలో ఉన్న రూ.40 వేలు నగదును, మద్య బాటిళ్లను ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. సంఘటనపై దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కడప అర్బన్ : కడప నగరం రాజంపేట బైపాస్‌లోని రామాంజనేయ పురం వద్ద బుధవారం అర్ధరాత్రి లారీ లోని బ్యాటరీ నుంచి మంటలు చెలరేగి లారీ దగ్ధమైనట్లు కడప అగ్నిమాపక శాఖ అధికారి యోగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కడప నెహ్రూ నగర్ కు చెందిన మాలే శివకు చెందిన 14 టైర్ల లారీని రామాంజనేయపురం పెట్రోల్ బంక్ సమీపంలో పార్కింగ్ చేసి ఉంచాడు. అర్ధరాత్రి లారీ బ్యాటరీ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు. బాధితుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దాదాపు రూ.20 లక్షల మేర నష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె రూరల్ : ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని వేంపల్లె పంచాయతీ జంగాలపల్లెకు చెందిన నారాయణ(50) శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఓ కాలేజీలో చదువుతున్న తన కుమార్తె భావన(20)ను బైక్‌లో ఎక్కించుకుని ఇంటికి వస్తుండగా, చిప్పిలి సమీపంలో బెంగళూరు నుంచి రాయచోటికి వెళుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మల్లిక (28) వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బావిలో దూకి ఆత్మహత్యాయత్నం

- బాధితుడిని కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్
- సకాలంలో స్పందించినందుకు ఎస్పీ ప్రశంస



ఆత్మహత్యకు ప్రయత్నించిన చెంగాచారిని తీసుకువస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ అమరనాథ్

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి చేతి నరాలు కోసుకుని బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సకాలంలో స్పందించిన ఏఆర్ కానిస్టేబుల్ బాధితుడిని కాపాడి ఆస్పత్రికి తరలించాడు. శుక్రవారం మదనపల్లెలో జరిగిన ఘటనకు సంబంధించి వివరాలిలా...కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణమాచారి కుమారుడు చెంగాచారి(33) తన భార్య శశి, కుమారుడితో కలిసి గురువారం మదనపల్లె పట్టణం ఎస్టేట్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వచ్చాడు. స్థానికంగా ఆలయానికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నాడు. అయితే, శుక్రవారం ఉదయం కుటుంబ సమస్యల కారణంగా చెంగాచారి భార్య శశితో గొడవపడ్డాడు. ఆమె దూషించడంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టణంలోని బెంగళూరు రోడ్డు మడికయ్యల శివాలయం వద్దకు చేరుకుని అక్కడే చేతి నరాలు కోసుకున్నాడు. కబరస్థాన్ పక్కన ఉన్న కోడిగుడ్డు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బావిలోకి దూకే క్రమంలో లోపల ఉన్న చెట్టు కొమ్మలకు తగులుకుని వేలాడుతూ, ప్రాణభయంతో కేకలు వేశాడు. అయితే అదే సమయానికి మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఎస్.అమరనాథ్, పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్లేందుకు అటువైపు వచ్చాడు. చెంగాచారి పెడుతున్న కేకలు విని అటువైపు వెళ్లి బావిలో వ్యక్తి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే ఓ తాడు తీసుకు వచ్చి మరొకరి సాయంతో బావిలోకి దిగి చెంగాచారిని బయటకు తీసుకువచ్చాడు. తన వాహనంలో జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి చేర్పించాడు. దీంతో బాధితుడికి ప్రాణాపాయం తప్పింది. విషయం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి దృష్టికి వెళ్లడంతో ఆయన ఏఆర్ కానిస్టేబుల్ అమరనాథ్‌ను అభినందించారు. విధి నిర్వహణలో నిబద్ధత చూపినందుకు ప్రశంసించారు. పోలీసు రివార్డుకు సిఫారసు చేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె బాట

- కడప డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన
- 13న విజయవాడలో మహాధర్నా
- 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరిక



కడప డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళన తీవ్రతరం అవుతోంది. శుక్రవారం కడప డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పోయిన కాంట్రాక్టు ఉద్యోగులతో విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, తమ కుటుంబాలకు ఆరోగ్య రక్షణ కల్పించాలని, 2022 పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలను చెల్లించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 13న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి మహా ధర్నా చేయనున్నామని, 15 నుంచి నిరధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై యాజమాన్యాలకు అనేక సార్లు నోటీసులిచ్చినా ఫలితం లేకుండా పోయింది. రాష్ట్రంలో 34వేల మంది కాంట్రాక్టు కార్మికులు, 7వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. విద్యుత్ సంస్థలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను భేషరతుగా క్రమబద్ధీకరించాలి. విద్యుత్ ప్రమాదాల వల్ల 450 మంది మరణించారు, 250 మంది కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. యాజమాన్యం వైద్యపరంగా వారికి ఎలాంటి సాయంగానీ, పరిహారం గానీ అందించలేదు. 1999 నుంచి 2004 వరకూ ఉద్యోగాల్లో చేరిన వారికి పెన్షన్ వర్తింపజేయాలి.

– బి. రామలింగారెడ్డి, విద్యుత్ జేఏసీ, రాష్ట్ర వైస్ చైర్మన్

న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది



2015లో నేను వల్లూరు సెక్షన్‌లో పని చేసేటప్పుడు విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదం సంభవించింది. ఆ ప్రమాదంలో నా ఎడమ చేయి కోల్పోయాను. 50 శాతం శరీరం కాలిపోయింది. కోర్టుకు పోయి ఏడాది పాటు పోరాటం చేస్తే డిగ్రీ అర్హత ఉన్నా జూనియర్ అసిస్టెంట్‌గా నియమించకుండా అటెండర్ పోస్టు ఇచ్చారు.

– జి. శేఖర్, కాంట్రాక్టు ఉద్యోగి

పనిచేయించుకొని ఒట్టి చేతులతో ఇంటికి



ఏళ్లతరబడి పనిచేయించుకొని రిటైరైన తర్వాత కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను ఒట్టి చేతులతో ఇంటికి పంపడం దారుణం. అన్ని ధరలు విపరీతంగా పెరిగిన ఈ కాలంలో రూ.20వేలతో ఎలా జీవనం సాగించాలి. స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చుల మాటేమిటి. .థర్డ్ పార్టీని రద్దు చేసి నేరుగా జీతాలు ఇవ్వాలి. ఎక్కువ పని చేయించుకుంటూ తక్కువ జీతం ఇస్తున్నారు. బిల్ రీడర్లకు న్యాయం చేయాలి.

– బ్రహ్మానందరెడ్డి, జేఏసీ నాయకులు

వైద్యానికి రూ.25 లక్షలు ఖర్చు



చింతకొమ్మదిన్నె సెక్షన్‌లో పనిచేసేటప్పుడు 2011లో ఎస్‌టీపీసీ ఎదురుగా ఉన్న విద్యుత్ లైన్లలో లోపం వల్ల 220 కేవీ విద్యుత్ ప్రసారం వల్ల ప్రమాదం జరిగింది. నా శరీరం 80 శాతం కాలిపోయింది. తొడలు, పిరుదులు పూర్తిగా కాలిపోయాయి. ఆసుపత్రిలో 8నెలల పాటు ఆరిటాకులు కప్పి ఉంచారు. చెన్నై విజయ హాస్పిటల్‌లో పూర్తి చికిత్స తీసుకోవడానికి రూ.25లక్షలు ఖర్చయ్యింది. చాలా పోరాటం చేస్తే షిఫ్ట్ ఆపరేటర్‌గా నియమించారు.

– ఏ. గంగరాజు, కాంట్రాక్టు ఉద్యోగి